తుందుర్రులో అభివృద్ధి కెరటాలు



ఆర్‌బీకే సెంటర్


గ్రామ సచివాలయం

- గత టీడీపీలో అభివృద్ధికి నోచుకోని వైనం
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో రూ.4 కోట్ల 11 లక్షలతో అభివృద్ధి పనులు

భీమవరం అర్బన్: మండలంలోని తుందుర్రు గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతుండగా మరికొన్ని పూర్తయ్యి గ్రామస్తులకు అందుబాటులోకి రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 6 వేల మంది జనాభా నివసిస్తున్నారు. సుమారు 2వేల 500 ఓటర్లు ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నాయకత్వంలో గత 58 నెలల్లో కుల, మత, రాజకీయ, వర్గ, లింగ బేధం చూడకుండా ఎన్నో అభివృద్ధి పనులు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో కాండ్రేగుల నరసింహరావుకు జెడ్పీటీసీ సభ్యుడిగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పదవిని ఇచ్చి విజయం సాధించేవరకు అహర్నిశలు కృషి చేశారు. అంతేకాకుండా గ్రామంలో ఆర్టీసీ బస్ సౌకర్యం ఏర్పాటు చేసి గ్రామస్తులకు ఏ సమస్య వచ్చిన అందుబాటులో ఉంటూ పరిష్కరిస్తున్నారు.

అభివృద్ధి పనులు ఇవే...

రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.కోటితో ఓవర్ హెడ్ ట్యాంకు, పైపులైన్లను నిర్మిస్తున్నారు. రూ.15.98లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం, రూ. 64 లక్షలతో పీహెచ్‌సీ నిర్మాణం, రూ.కోటి 3 లక్షలతో జెడ్పీహెచ్‌స్కూల్ అభివృద్ధి, రూ. 19.60లక్షలతో ఎంపీపీ స్కూల్ ఆధునికీకరణ, రూ. 10.64 లక్షలతో ఎంపీపీ స్కూల్ (స్పెషల్) అభివృద్ధి పనులు, రూ.15 లక్షలతో హిందూ శ్మశానవాటిక నిర్మాణం, రూ. 10 లక్షలతో కాంపౌండ్ వాల్, రూ. 10.50 లక్షలతో పల్లపు వీధి డ్రైనేజీ నిర్మాణం, సీసీ రోడ్లు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నిధులు మంజూరు చేయడంతో కొన్ని పూర్తవగా మరికొన్ని నిర్మాణలు వేగంగా జరుగుతున్నాయి. అంతేకాకుండా సంక్షేమ పథకాలు ద్వారా ప్రతి కుటుంబానికి రూ. 50 వేలు నుంచి 5 లక్షలు వరకు లబ్ధి చేకూరింది

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



గోదావరి ఆక్వా ఫుడ్ పార్కు నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాడిన గ్రామస్తులకు, పోరాట కమిటీ నాయకులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంది. కానీ 2019లో ఎన్నికల్లో జనసేనకు ఎక్కువ ఓట్లు వేశారు. అయినా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కుల, మత, రాజకీయ చూడటంతో గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి గ్రామస్తులంటే ఎంత అభిమానమో? చాటుకున్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చిన వెంటనే ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వెంటనే పరిష్కరిస్తున్నారు.

– ఆరేటి సత్య వెంకట వీరాస్వామి నాయుడు (పెద్దబ్బు) సర్పంచ్, తుందుర్రు


నిర్మాణంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు

టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యం

గత టీడీపీ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) గోదావరి ఆక్వా ఫుడ్‌పార్కు నిర్మాణానికి మద్దతు ఇవ్వడంతో గ్రామం అభివృద్ధి పనులు చేయకపోగా అటువైపు కన్నెత్తి చూడలేదు. ఫుడ్ పార్కు పోరాట నాయకులపై కేసులు పెట్టడంలో పులపర్తి అంజిబాబు ప్రధాన పాత్ర పోషించారని కార్యక్రమాలను బాయ్‌కాట్ చేసి గ్రామస్తులు నిరసన తెలిపారు. ఫుడ్ పార్కు నిర్మాణానికి మద్దతు ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే అంజిబాబుకు కొందరు పోరాట నాయకులు అండగా ఉండటంతో గ్రామస్తులు వాళ్ల తీరుపై మండిపడుతున్నారు. అప్పుడు అంజిబాబు కార్యక్రమాలను బాయ్‌కాట్ చేసి పోరాట కమిటీ నాయకులు అండగా ఉంటున్నారని పలువురు గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయం


పీవీఎల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మేకా శేషుబాబు, పెండ్ర వీరన్న

కాళ్ల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు, సంచారజాతుల కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న ధీమా వ్యక్తం చేశారు. కాళ్ల మండలం పెద అమిరం పార్టీ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజును శనివారం వారు మర్యాదపూర్వకంగా కలిశారు. నామినేషన్ వేసిన పీవీఎల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేకా శేషుబాబు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేస్తారని అన్నారు. ప్రధానంగా ఉండిలో పీవీఎల్ నరసింహరాజును అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఉండిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నంది నాటక అవార్డు గ్రహీత ఉగాది మృతి


పులఖండం ఉగాది (ఫైల్)

భీమవరం: నంది నాటక అవార్డు గ్రహీత, రంగస్థలం సీనియర్ కళాకారుడు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పునర్నిర్మాణ కర్తల్లో ఒకరైన పులఖండం ఉగాది(58) శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉగాది తన 16వ ఏటనుంచే ఎన్నో నాటకాలు, నాటికలు, సినిమాలు, తెలుగు షార్ట్ ఫిలిమ్స్‌లో నటుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు. ఉగాది సుమారు 300 నాటక పరిషత్‌ల పోటీల్లో పాల్గొన్నారు. గత రెండేళ్లుగా అనారోగ్యంతో వైద్యం చేయించుకుంటున్నప్పటికీ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఉగాది మృతిపై ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలిజిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్, గొన్నాబత్తుల మల్లేశ్వరరావు, చాంద్ బాషా, బీవీఆర్ కళా కేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల వెంకటరామారావు, రాయప్రోలు భగవాన్, జవ్వాది దాశరథి శ్రీనివాస్ తదితరులు సంతాపం తెలిపారు.

న్యాయశాఖ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం


వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని న్యాయశాఖ ఉద్యోగులకు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులకు డాక్టర్ కె.జెరూష, సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జెరూష మాట్లాడుతూ వేసవికాలంలో ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన ముందుజాగ్రత్తలను వివరించారు. తరచూ మంచినీరు, మజ్జిగ , నిమ్మరసం, పంచదార, సాల్ట్ కలిపిన నీటిని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎ.పవన్ కుమార్, జి.సురేష్ బాబు, డి.ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

మూడోరోజు నామినేషన్లు నిల్

ఉండి: ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల పర్వంలో మూడోరోజు శనివారం నామినేషన్లు దాఖలు కాలేదని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్‌ఆదిత్య తెలిపారు. నామినేషన్ల స్వీకరణ గడువు ఈనెల 25వ తేదీ వరకు మాత్రమే ఉందని, అందరు అభ్యర్థులు గమనించాలన్నారు. అలాగే 26వ తేదీన నామినేషన్ల పరిశీలన, 29వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు.

బైక్ చోరీపై కేసు

భీమవరం: తన ఇంటి వద్ద పార్క్‌చేసిన బైక్ మాయమైందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ కె.వెంకటేశ్వరరావు శనివారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన పి.ఆంజనేయులు ఈ నెల 17న ఇంటివద్ద పార్క్ చేసిన ప్యాషన్ ప్రో మోటారు సైకిల్ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల అంతా వెదికినా ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులను ఆశ్రయించాడు.

ముత్యాలమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి హుండీని శనివారం లెక్కించగా సుమారు 64 రోజుల కాలానికి గాను రూ.14,63,735ల ఆదాయం లభించినట్లు ఈఓ డి.రామకృష్ణంరాజు తెలిపారు. ఈ లెక్కింపులో దేవదాయ, ధర్మదాయ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరావు, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు


రాజీనామాలు చేసిన వలంటీర్లు

కాళ్ల: మండలంలోని పలు గ్రామాల్లో వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. కాళ్ల మండలం కలవపూడిలో 16 మంది, కాళ్లలో 28 మంది, జువ్వలపాలెంలో 16 మంది, ఏలూరుపాడులో 19 మంది వలంటీర్లు శనివారం రాజీనామాలు చేశారు. ఈమేరకు ఆయా గ్రామాల్లో కార్యదర్శులకు వారు రాజీనామా పత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేస్తున్న తమపై ప్రతిపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలకు నిరసనగా వలంటీర్ విధులకు రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఇకపై తాము వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రి చేసుకోవడానికి తామంతా కృషి చేస్తామని చెప్పారు. ఉండి నియోజకవర్గంలో పీవీఎల్ నరసింహారాజును అఖండ మెజార్టీతో గెలిపించేందుకు పనిచేస్తామన్నారు.

విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు నేర్చుకోవాలి


కోపల్లెలో డీఈఓ వెంకటరమణతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కాళ్ల: విద్యార్థిదశ నుంచే నైతిక విలువలు నేర్చుకోవాలని డీఈఓ ఆర్.వెంకటరమణ అన్నారు. కాళ్ల మండలం కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐక్య నేషనల్ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు, నైతిక విలువలు, సాంస్కృతిక, ఆటల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడం కోసం ఏర్పడిన ఐక్య నేషనల్ ఫౌండేషన్ కార్యక్రమాలను అభినందించారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులు డీఈఓని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నిర్మలాదేవి, ఫౌండేషన్ చైర్మన్ ముదునూరి శివరామరాజు, సెక్రటరీ దాయన సురేష్‌చంద్ర, భీమవరం సబ్ ట్రెజరీ ఆఫీసర్ ఏ. రవివర్మ, ఎంఈఓ కనకరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి

- ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ పిలుపు
- కాళ్ల, ఆకివీడు మండలాల నాయకులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న పీవీఎల్ నరసింహరాజు

కాళ్ల: ప్రతి గ్రామంలోనూ బూత్ స్థాయిలో మెజార్టీ సాధించేలా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు పిలుపునిచ్చారు. కాళ్ల మండలం పెద అమిరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో శనివారం కాళ్ల, ఆకివీడు మండలాల నాయకులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న అన్ని బూత్ స్థాయిలో సమర్థులైన వారిని ఎన్నుకుని పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. రానున్న 20 రోజులు కష్టపడి పనిచేసి ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల వారీగా నాయకులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి బూత్‌లోను ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, ప్రతిపక్షాలు చేస్తున్న నీచ రాజకీయాలను తిప్పికొట్టాలని వివరించాలన్నారు. ప్రతినెలా 1వ తేదీన తెల్లవారుజామున ఇంటికి తెచ్చి పింఛన్లు ఇవ్వకుండా ప్రతిపక్షాలు చేసిన కుట్రను ప్రజలకు తెలియజేయాలన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని, ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని పీవీఎల్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, ఆకివీడు మున్సిపల్ చైర్మపర్సన్ జామి హైమావతి, గాదిరాజు సుబ్బరాజు, పాతపాటి వర్మ, కాళ్ల, ఆకివీడు మండలాల ఎంపీపీలు పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, కటారి జయలక్ష్మి కేశవ రావు, జెడ్పీటీసీలు పచ్చిగోళ్ళ సోమేశ్వర రావు, వేగేశ్న వెంకటరాజు, ఆకివీడు ఏఎంసీ చైర్మన్ షేక్ రసూల్ బీబీ, మండల కన్వీనర్లు గణేష్న రాంబాబు, అన్యం కృష్ణ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి కన్వీనర్లు పాల్గొన్నారు.

అభ్యర్థుల వ్యయ వివరాలను పక్కాగా లెక్కించాలి


ఉండిలో మాట్లాడుతున్న పీయూష్ శుక్లా

ఉండి: ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో అభ్యర్థులు పరిమితికి మించి ఖర్చుచేసే అవకాశం ఉన్నందున ఆయా కార్యక్రమాల ఖర్చులపై నిరంతర నిఘా ఉంచాలని నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు పీయూష్ శుక్లా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఉండి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్యతో కలసి ఆయన కార్యాలయంలోనే అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్లా మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయాల వివరాలను పక్కాగా లెక్కించాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు చేసే ప్రతి ఖర్చును పైసాతో సహా ఎన్నికల వ్యయంలోకి వస్తుందని వాటిపై ఎలక్షన్ అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని అన్నారు. ఎన్నికల వ్యయం లెక్కింపులో పనిచేసే బృందాల నుంచి ఎప్పటికప్పుడు వివరాలు సేకరించాలన్నారు. వాటిని పట్టికల ద్వారా ఎన్నికల వ్యయ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు, పెయిడ్ న్యూస్‌కు సంబంధించిన వ్యయ వివరాలను బి–16 ద్వారా ఎంసీఎంసీ తెలియజేస్తుందని, వాటిని కూడా ఎప్పటికప్పుడు వ్యయంలో లెక్కించాల్సి ఉంటుందన్నారు. అనంతరం వ్యయాల నమోదుపై పలువురు అధికారుల ప్రశ్నలకు పీయూష్ శుక్లా సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీటీడీఎస్ రవీంద్ర, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయం


సమావేశంలో పాల్గొన్న గ్రంధి శ్రీనివాస్, గూడూరి ఉమాబాల, వేండ్ర వెంకట స్వామి


పార్టీలో చేరుతున్న వారిని ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): ఎమ్మెల్యే అంటే గుడిలో దేవుడు కాదని, ఈ పదవికి సమయంతో పనిలేదని కేవలం బాధ్యతతో మాత్రమే పనిచేయాల్సి ఉందని, నాడు నేడు కూడా తాను అదే చేశానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు. పట్టణంలోని 3 టౌన్ లో హౌసింగ్ బోర్డ్ కాలనీ, మారుతి నగర్, వేండ్ర కాలువ గట్టు వద్ద శనివారం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. తాను ఎమ్మెల్యే పదవిని అలంకారంగా తీసుకోలేదని, కేవలం బాధ్యతగా తీసుకుని పని చేశానని, దాని కారణంగానే ఈ 58 నెలల కాలంలో భీమవరం నియోజకవర్గ పరిధిలోని వీరవాసరం, భీమవరం మండలాలతో పాటుగా భీమవరం పట్టణాన్ని కూడా పెద్ద ఎత్తున అభివృద్ధి చేశానన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే వద్దకు వచ్చి చెప్పుకుంటే అందులో తప్పేముందని ఆయన ప్రశ్నించారు. కొన్ని పనులు అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నప్పుడు ప్రజలు ఒక బాధ్యతగా ఎమ్మెల్యే దగ్గరికి వచ్చి చెప్పుకుంటారని, ఆ సమస్యలను వెంటనే అధికారులకు తెలియజేసి వాటి పరిష్కారానికి కృషి చేయడం ఎమ్మెల్యేగా ఒక బాధ్యతని, ఆ విషయం కూడా తెలియని 70 ఏళ్ల దాటిన నాయకులు తామేదో తప్పు చేసినట్లుగా అవాస్తవాలు ప్రచారం చేయడం ఆయన వయస్సుకు తగదని వెల్లడించారు. వేండ్ర వెళ్లే దారిలో 126 ఎకరాల భూమిని సేకరించి తొమ్మిది కోట్ల నిధులతో ఆనాడు 60 ఎకరాల్లో భారీ మంచినీటి పథకాన్ని నిర్మించడం వల్లనే నేడు పట్టణ ప్రజలకు త్రాగు నీటి సమస్య పరిష్కారమైందన్నారు. వేరువేరుగా జరిగిన ఈ కార్యక్రమాలలో ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, టీటీడీ పాలక మండలి సభ్యులు మేకా శేషుబాబు, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, మేడిది జాన్సన్, పెండ్ర వీరన్న, తోట భోగయ్య, ఎస్.సూర్యనారాయణ రాజు, కంతేటి వెంకటరాజు, కె.బాల వెంకటరత్నం, జె.మధు, మడిపల్లె శేఖర్, అల్లూరి బంగార్రాజు, చెలంకి గిరి, వేండ్ర విజయదుర్గ, చెల్లబోయిన సూర్య ప్రకాష్, బి.రామకృష్ణ వర్మ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

వేండ్ర కాలవగట్టు వద్ద ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో జనసేన పార్టీ చెందిన నాయకులు కార్యకర్తలు సుమారు వందమందికి పైగానే వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో గాదిరాజు సత్యనారాయణ రాజు, గాదిరాజు రామరాజు, కోడె యుగంధర్, కట్టా రవి, నందం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలపై హర్షం

భీమవరం (ప్రకాశంచౌక్): భారత ఎన్నికల కమిషన్ ఓటింగ్ శాతం పెంచాలనే సంకల్పంతో దివ్యాంగులకు, 85 ఏళ్లు దాటిన వృద్ధులకు ఓటు వేసేందుకు ప్రత్యేక సౌకర్యం కల్పిస్తుందని సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి అన్నారు. ఇంటి వద్ద నుంచే ఓటు వినియోగం చేసుకునేలా చేయడం శుభ పరిణామమని అన్నారు. దీనిపై దివ్యాంగులు హర్షం ప్రకటిస్తూ క్విట్ ఇండియా స్థూపం వద్ద శ్రీవిజ్ఞానవేదిక, రెవెన్యూ శాఖ అధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రంగసాయి మాట్లాడుతూ దివ్యాంగులు ఎన్నికల కమిషన్ అందించే సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు సీతారామరాజు, వెంకటరాజు, వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు నరికడమిల్లి లక్ష్మణ రావు, దుర్గారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

మొగల్తూరు: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా డాక్టర్లు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు సూచించారు. శనివారం మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రికార్డులు పరిశీలించి డాక్టర్లు లక్ష్మీ పార్వతి, ఒ.దినేష్‌లతో మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని, రోగులకు మందులు అందుబాటులో ఉంటున్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

బీజేపీ, దాని మిత్రపక్షాలను ఎన్నికల్లో ఓడించాలి


భీమవరంలో సీపీఎం సమావేశంలో మాట్లాడుతున్న బలరామ్

భీమవరం: రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయని భారతీయ జనతా పార్టీ, దానితో అంటకాగుతున్న తెలుగుదేశం, జనసేన పార్టీలను రానున్న ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ పిలుపునిచ్చారు. శనివారం భీమవరంలోని ప్యాడీమర్చంట్స్ భవనంలో నిర్వహించిన భీమవరం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో దేశానికి, రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు. యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి దగా చేశారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలని కాపాడుతామని చెప్పి ప్రభుత్వం ప్రైవేటు వాళ్లకు అమ్మేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్, నాయకులు ఎం.వైకుంఠరావు, జుత్తిగ నర్సింహమూర్తి, ఇంజేటి శ్రీను, డి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

పాలకొల్లు సెంట్రల్: అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక సిబ్బంది అందించే సేవలు అభినందనీయమని పట్టణ మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి కొనియాడారు. శనివారం అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ విజయసారథి మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు కంగారులో ఏదో ఒకటి చేసేయాలనే ఉద్దేశంతో మరింత నష్టానికి కారకులవుతుంటారని అన్నారు. సమయ స్ఫూర్తితో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం వల్ల ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టాన్ని కూడా తగ్గించవచ్చన్నారు.

రాజకీయాలకు అతీతంగా బహుజన జేఏసీ మద్దతు


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ బహుజన జేఏసీ నాయకులు

భీమవరం: రాష్ట్రంలో రాజకీయాలకు అతీతంగా ఏపీ బహుజన జేఏసీ ప్రస్తుత ఎన్నికల్లో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఏపీ బహుజన జేఏసీ ఫౌండర్ అండ్ కన్వీనర్ తాళ్లూరి మధు చెప్పారు. శనివారం భీమవరంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో సామాజిక, సాంఘిక పోరాటాలు చేస్తూ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న బహుజన జేఏసీ మే 13న జరిగే ఎన్నికల్లో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు రాష్ట్రవ్యాప్తంగా మద్దతు పలుకుతున్నట్లు చెప్పారు. నరసాపురం పార్లమెంట్‌కు వైఎస్సార్ సీపీ తరపును పోటీచేస్తున్న గూడూరి ఉమాబాలకు ప్రత్యర్థిగా నాన్‌బీసీ అభ్యర్థి పోటీలో ఉన్నందున బహుజన జేఏసీ ఉమాబాలకు మద్దతు పలికి ఆమె విజయానికి కృషిచేస్తామని మధు స్పష్టం చేశారు. జేఏసీ స్టేట్‌ప్రెసిడెంట్ కోనా జోసఫ్ మాట్లాడుతూ క్రైస్తవులకు వ్యతిరేకంగా మాట్లాడి వారిపై కోర్టుల్లో కేసులు వేసిన కనుమూరి రఘురామకృష్ణంరాజు ఎక్కడ పోటీచేసిన ఆయన ఓటమికి కృషిచేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీస్‌లో ర్యాంకు సాధించిన కొయ్యే చిట్టిరాజుకు సమావేశం అభినందనలు తెలిపింది. ఈ కార్యక్రమంలో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బందెల జార్జిరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బుంగా ఆదాము, మహిళా కోఆర్డినేటర్ గరికిముక్కు మేరీ అలీషా, వస్త్రాల రవి, దానం విద్యాసాగర్ పాల్గొన్నారు.